## క్లుప్తంగా

### రేపు మండల సర్వసభ్య సమావేశం

**యద్దనపూడి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 5వ తేదీ మంగళవారం ఎంపీపీ పలగం రజనీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ మహ్మద్ అఖీబ్ జావెద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నాలని కోరారు.

### మోటారు కేబుల్ వైరు చోరీ

**బల్లికురవ:** ఇటీవలి కాలంలో మండలంలో పొలాల్లోని మోటారు కేబుల్ వైర్లు ప్యానల్ బోర్డులు చోరీకి గురవుతున్నాయి. శనివారం అర్ధరాత్రి అద్దంకి–బల్లికురవ ఆర్అండ్‌బీ రహదారిలోని వల్లాపల్లి గ్రామ సమీపంలోని మసీదు వద్ద ఉన్న తొరటి యహషువా పొలంలోని మోటారు కేబుల్ వైరు చోరీకి గురైంది. ఆదివారం ఉదయం పొలం వెళ్లి మోటారు వేద్దామని చూడగా కేబుల్ వైరు లేకపోవడం పట్ల అయోమయానికి గురై చోరీ జరిగినట్లుగా గుర్తించాడు. ప్రధాన రహదారిలోనే చోరీలు జరగం పట్ల రైతులు భయాందోళనలు చెందుతున్నారు.

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడు కోటేశ్వరరావు

**అద్దంకి రూరల్:** కారు ఢీకొని బైకిస్టుకు గాయాలైన ఘటన మండలంలోని ఆదివారం చోటచేసుకుంది. అందిన వివరాల మేరకు.. దర్శి మండలం చిన ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన గాలం కోటేశ్వరరావు పనిమీద బైక్‌పై అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై వెళ్తున్నారు. మండలంలోని శాంతినగర్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కోటేశ్వరరావుకు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

### వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**చీరాల అర్బన్:** వృద్ధాప్యంలో వృద్ధులకు తరచూ అనారోగ్య సమస్యలు వస్తుంటాయని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా పాటించి ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించాలని కాటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉపాధ్యక్షుడె ఎస్. యల్లమందారెడ్డి అధ్యక్షతన ఆరోగ్య సదస్సును నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుండె పరీక్షలు, షుగర్, బీపీ, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ పరీక్షలు తరచూ చేయించుకొని తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కట్టా రాజ్‌వినయ్‌కుమార్, సెక్రటరీ రామారావు, మునిరుల్లాఖాన్, ఎ.నాగవీరభద్రాచారి, వూటుకూరి వెంకటేశ్వర్లు, పి.శివాంజనేయప్రసాద్, కృష్ణమూర్తి, వెన్నెలకంటి శర్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో పోలేరమ్మ తల్లి

**బల్లికురవ:** బల్లికురవ గ్రామంలోని పోలేరమ్మ ఆలయం 14వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలిపారు. శ్రావణ మాసం రెండో ఆదివారం సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచే విశిష్ట పూజలతోపాటు అమ్మవారికి తమ తమ మొక్కులు చెల్లించారు. అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి పూజలు, అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామంతోపాటు, పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### ఆక్రమణల్లో ట్రాన్స్‌ఫార్మర్


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

**బల్లికురవ:** గ్రామానికి విద్యుత్ సరఫరానిచ్చేందుకు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మట్టితోలి ఆక్రమణలకు పాల్పడటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆశాఖ అధికారులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేసున్నారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే రోడ్‌కు తూర్పు భాగంలో బల్లికురవ గ్రామానికి విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు 1985లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అప్పట్లో పల్లంలో ప్రభుత్వ డీకే భూమిలో ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో భూముల ధరలకు రెక్కలు రావటంతో లోతట్టులో ఉన్న ఈ భూమిని ఆక్రమణదారులు మట్టితొలి అభివృద్ధి పరుకుకున్నారు. రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదం సంభవించకుండా కనీసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కనీసం కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# అన్నీ సగం సగం పనులే..!


రైల్వేగేటులోని గుంతలతో ఉన్న అప్‌లైన్ మార్గం


వాహనాలకు ఇబ్బందిగా ఉన్న డౌన్‌లైన్ మార్గం

- రైల్వే గేటు పట్టాలపై రాకపోకలు సంగతి మరిచిన అధికారులు
- స్పందించాలంటున్న ప్రజలు

**చినగంజాం:** ప్రభుత్వ పనులు అంటే చాలు అంతా నిర్లక్ష్యమే. ఎవరొచ్చి ప్రశ్నిస్తారులే.. అని దీర్ఘంగా పైపైనే పనులు చేసి వదిలించుకుంటున్నారు. చినగంజాం రైల్వే స్టేషన్ పరిధిలో ఉత్తరం వైపు సోపిరాల రైల్వే గేటు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండల కేంద్రం చినగంజాం గ్రామంలోనికి రావాలంటే ఈ రైలు గేటు ప్రధాన మార్గంగా కొనసాగుతుంది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది మూడు నెలల క్రితం ఆ ప్రాంతంలో రైలు పట్టాల మరమ్మతులు పూర్తి చేశారు, కాని పనులు పూర్తయిన వెంటనే గేటు నందు రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న మార్గం సుగమం చేసే పనిని మరచిపోయారు. రైలు గేటు నందు ఉన్న అప్‌లైన్, డౌన్ లైను రెండు పట్టాలను రైళ్ల రాకపోకలకు సాంకేతికంగా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. అయితే ఆ సమయంలో తవ్విన గుంతలను చదరం చేసి బాగు చేసి పనిని నిర్వహించకుండా వదిలేశారు. రైలు గేటు దాటేందుకు వందల సంఖ్యలో వాహనాలు ఈ గేటు మార్గాన్ని ఉపయోగిస్తుంటారు.

**గాయపడుతున్న వాహనదారులు..**

గేటు మార్గం గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు రైల్వే సిబ్బంది రెండు లైనుల వద్ద తవ్వి మరమ్మతులు పూర్తి చేసి ఆ గుంతలను తాత్కాలికంగా వదలి వేయడంతో గేటు గుండా ప్రయాణం సాగించే వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రైల్వేగేటు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. భారీ వాహనాలు, కార్లు, ద్విచక్రవాహనాలు ఎక్కువగా ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో భారీ వాహనాలు కలిగే ఇబ్బందులు సంగతి ఎలా ఉన్నా ద్విచక్రవాహనదారులు తమ వాహనాలు గుంతలను, ఎత్తుగా రైలు పట్టాలను దాటి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ద్విచక్రవాహనదారులు పలువురు జారిపడి గాయాలపాలయ్యారు. ఇదే గేటులో మూడోలైనుకు వేసిన విధంగా రబ్బరుతో మార్గాన్ని సుగమం చేసినట్లయితే ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ సమస్యపై రైల్వే అధికారులు స్పందించి ఎక్కువ సమయం తీసుకోకుండా వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందుల కోసం చర్యలు త్వరితంగా చేపట్టాలని కోరుతున్నారు.

# గ్రామాల్లో డ్రోన్‌లతో నిరంతర పర్యవేక్షణ


కారంచేడు–ఆదిపూడి రోడ్డులో డ్రోన్ ద్వారా పర్యవేక్షణ


చీరాల–పర్చూరు రోడ్డులోని కారంచేడు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో ఇలా

- సత్ఫలితాలు ఇస్తున్నాయంటున్న ఎస్‌ఐ

**కారంచేడు:** గ్రామాల్లో జరిగే నేరాలను అదుపు చేయడానికి ఉన్నతాధికారుల ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘాను ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని అన్ని ప్రధాన వీదులు, కారంచేడు–కుంకలమర్రు రోడ్డులోని కొమ్మమూరు ఆయకట్టు ప్రాంతాలు, స్వర్ణ–కారంచేడు రోడ్డులోని వ్యవసాయ భూములు, ఆదిపూడి–కారంచేడు రోడ్డులోని చెరువులు, నీటి కుంటలు, పంట కాలువల కట్లమీద జరిగే అనేక కార్యకలాపాలాపాలను పర్యవేక్షించామన్నారు. ఆదివారం కావడంతో అనేక మంది యువత మద్యం తాగేందుకు చెరువు గుట్లు, కాలువ కట్లలు, పంట కాలువల మీద కూర్చొని ఉండటాన్ని ఆయన డ్రోన్ నిఘాతో పరిశీలించామన్నారు. మద్యం ప్రియులతో పాటు, అక్కడక్కడ పేకాడుతున్న స్థావరాలు సైతం నిఘా కెమెరాలకు చిక్కుతున్నాయన్నారు. ఇలా గ్రామాల్లో నిరంతరం డ్రోన్‌ల సహకారంతో నిఘా ఏర్పాటు చేయడం వలన నేరాలను ఎంతో కొంత అదుపు చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. మంది ఫలితాలు వస్తున్నాయన్నారు. గతంలో బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి కార్యకలాపాలు జరిగుతుండేవని, ప్రస్తుతం వీటి సంఖ్య గణనీయంగా తగ్గిందాన్నరు. రాబోవు రోజుల్లో మరింత నిఘాను ఏర్పాటు చేయడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దొరికిన వారిపై శాఖాపరమైన చర్యలు, కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రోన్‌ల ద్వారా వీడియోలు, ఫోటోలు తీస్తున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు, పెద్దలు అభినందిస్తున్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు. యువతలో మాత్రం భయం పెరిగిందని ఆయన చెప్పారు.

# కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం..


క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

- పట్టణంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం

**చీరాల:** ఎన్నికల ముందు ఓట్లు దండుకునేందుకు ప్రజలకు అమలు కాని హామీలను గుప్పించి అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించడంలో కూటమి ప్రభుత్వ పెద్దల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం పట్టణంలోని 24, 25, 26 వార్డుల్లో బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్‌బుక్ పేరుతో కూటమి అక్రమాలు ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికే చాలా మంది పార్టీ నాయకులను, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ప్రజలంతా ఇది గమనిస్తూనే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. కూటమి పాలనతో రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరని, రాష్ట్రంలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. ఏడాది దాటినా ప్రభుత్వ ఓ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలను ప్రజలందరికి అందించామన్నారు. సీఎం చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక విఫలమయ్యారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారిని పార్టీ ఎన్నటికి మర్చిపోదన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బత్తుల అనిల్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్ కంపా అరుణ్, శిఖా సురేష్, రాజు వెంకటేశ్వరరెడ్డి, అన్నం సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి హామీలు.. నీటి మీద రాతలు


బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో పాల్గొన్న నాయకులు

**మార్టూరు:** అధికారం చేపట్టడం కోసం కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలు నీటి మీద రాతల్లా మారాయని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో బాగంగా మండలంలోని రాజుపాలెం గ్రామంలోని శాంతినగర్, యాదవ బజార్‌లలో ఆదివారం రాత్రి వారు స్థానికులతో మాట్లాడారు. వేలాదిమంది విద్యార్థుల తల్లుల ఖాతాలో తల్లికి వందనం జమకాలేదని ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులకు నెలనెల అస్తానన్న నిరుద్యోగ భృతి ఏమైందని, ఆడబిడ్డలకు ప్రతినెల రూ 1500 చొప్పున ఇస్తానని వాగ్దానం చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాలను వారికి వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, గ్రామనాయకులు వేల్పుల పొలురాజు, కొమెర శ్రీను, తిరుపతి విష్ణు, అనంత సత్యనారాయణ,అంజిబాబు, మండల జిల్లా నాయకులు పఠాన్ కాలేషావలి,ఉప్పలపాటి అనిల్ చౌదరి, గర్నెపూడి రవిచంద్, గడ్డం మస్తాన్‌వలి, అడకా గంగయ్యయాదవ్, తమ్ములూరి సురేష్, చిన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చప్టాలపై రక్షణ కరువు


చినరావిపాడు – మర్రిపాలెం మధ్యలో కాలువపై ఉన్న చప్టాకు రక్షణ గోడ లేని దృశ్యం


తొర్రగుడిపాడు – ఎర్రగుడిపాడు మధ్యలో ముదిగొండ వాగుపై ప్రమాదకరంగా ఉన్న చప్టా

**చీమకుర్తి రూరల్:** మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న చప్టాలకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తొర్రగుడిపాడు – ఎర్రగుడిపాడు మధ్యలోని ముదిగొండ వాగుపై ఉన్న చప్టాలకు రక్షణ గోడలు లేకపోవడంతో పాటు ప్రమాదకర మలుపు ఉండటంతో గతంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. అదేవిధంగా చినరావిపాడు – మర్రిపాలెం మధ్యలో కాలువపై చప్టాకు రక్షణ గోడ లేకపోవడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో ఇటువంటి ప్రమాదకర చప్టాలు చాలా ఉన్నాయని, వాటిపై కూటమి ప్రభుత్వం, పాలకులు, అధికారులు దృష్టి సారించి ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పల్లె పోలేరమ్మ తల్లికి ఘనంగా పూజలు

**దొనకొండ:** మండలంలోని ఇండ్లచెరువు గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ పల్లె పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు చేశారు. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన యాదవులు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పూజలు నిర్వహిస్తారు. అందులో భాగంగా వారు పిల్లాపాపలతో కలిసి నైవేద్యాలు చేసి అమ్మవారికి సమర్పించారు. వర్షాలు సకాలంలో పడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ పూజలు చేశారు.

## భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

**తాళ్లూరు:** మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో సోమవరప్పాడు గ్రామంలో ప్రసిద్ధగాంచిన పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మిలు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగశిలలు, మల్లికార్జునస్వామికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కే ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

# విద్యార్థి చదువుకి ఆర్థిక సాయం


విద్యార్థి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**వేటపాలెం:** బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు అదే కళాశాల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న పేద విద్యార్థి ఉన్నత చదువుల కోసం రూ. 13 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. రావూరిపేటకు చెందిన పేద విద్యార్థి సయ్యద్ సుభాని ఇంటర్మీడియట్‌లో 983 మార్కులు సాధించాడు. అయితే వారి కుటుంబం పేదరికంలో ఉండటంతో విద్యార్థి ఉన్నత చదువుల కోసం కళాశాల్లో పూర్వ విద్యార్థులు కలసి సేకరించిన నగదును విద్యార్థి తండ్రి కరిముల్లాకి అందజేశారు. కార్యక్రమంలో ఎం బేగ్, బండ్ల బాబు, దేవర గంగాధర్‌రావు, కందాటి రంగా, పిచ్చుక భార్గవ్ రామ్, సయ్యద్ ఖాదర్, సయ్యద్ అజీజ్, షేక్ సుభాని పాల్గొన్నారు.

# ఉచిత గుండె వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**జే.పంగులూరు:** రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పంగులూరు రోటరీ భవనంలో నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ నాగకిరణ్ 60 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మందికి మెరుగైన వైద్య పరీక్షలు చేసేందుకు వారిని హాస్పిటల్‌కు సిఫారసు చేశారు. కార్యక్రమంలో పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల వీరనారాయణ, సెక్రటరీ రాయిణి రామారావు, రోటెరియన్లు పెంట్యాల జగదీశ్వరరావు, కరణం హనుమంతురావు, షేక్ కాలేషావలి, గుర్రం ఆంజనేయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేని క్వారీలు మూసివేయాలి


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

**అద్దంకి రూరల్:** లైసెన్స్‌లు లేని క్వారీలపై అధికారులు చర్యలు తీసుకుని వెంటనే మూసివేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డీ. రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో మృతి చెందిన కార్మికులు మృతదేహాలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మృతి చెందిన ఒడిశా కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. భద్రత కల్పించలేని క్వారీల లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉన్నారు.

# రిచర్డ్‌సన్ సాల్మన్ మరణం బాధాకరం


రిచర్డ్‌సన్ సాల్మన్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ, నాయకులు

**చీరాల:** పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ రిచర్డ్‌సన్ సాల్మన్ మరణం చీరాల ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం రాత్రి ఆయన మృతి చెందగా ఆదివారం స్థానిక సాల్మన్ సెంటర్‌లోని ఆయన నివాసంలో పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చీరాల ప్రాంతంలో ఎంతో మంది పేద ప్రజలకు వైద్యం చేసిన ఆయన అందరికీ సుపరిచితులు. పంచాయతీ కార్యాలయానికి భవనాన్ని కూడా వైద్యులే దానంగా ఇచ్చారు. ఆయన పేరుతోనే సాల్మన్ సెంటర్ పంచాయితీ ఇప్పటికీ కొనసాగుతోంది. డాక్టర్ రిచర్డ్ సన్ సాల్మన్‌కు చీరాలలోని పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ చిమటా సాంబు, మాజీ కౌన్సిలర్లు పులిపాటి బాబురావు, మల్లెల బుల్లిబాబు, డాక్టర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ చుండూరి వాసు, పేర్లి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్


కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

**పర్చూరు(చినగంజాం):** వినియోగదారులకు భారమైన స్మార్ట్ మీటర్‌లను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ప్రజావేదిక తరపున పర్చూరులో ఆదివారం సీపీఎం కార్యకర్తలు కరపత్రం పంపిణీ చేశారు. విద్యుత్ చార్జీల దోపిడిని ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ఇంధన సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రేపు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం కరపత్రాలను ప్రజలకు అందజేసింది. స్మార్ట్ మీటర్‌లను బిగించడం వలన ముందుగానే బిల్లులు చెల్లించాలని, బిల్లులు తిరిగి వస్తున్నాయని ఈ పాటికే వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారని స్మార్ట్ మీటర్లు పగులగొట్టమని చెప్పిన లోకేష్ అవే మీటర్లు అదే కాంట్రాక్టర్‌లను కొనసాగించడం ఏమిటని గంగయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి శంకరయ్య, డేవిడ్, చినదాసు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీ కొండయ్య పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలన అంతా మోసం

**చినగంజాం:** ఎన్నికల సమయంలో బూటకపు హామీలను ఇచ్చి ప్రజలందరిని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలందరికీ తెలియజేద్దాం అని చినగంజాం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మోటుపల్లి పంచాయతీ అడివీధిపాలెం గ్రామంలోని జీడిచెట్లపాలెం గ్రామంలో బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామ నాయకులు, కార్యకర్తలతో నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండూరి గోవింద్, కొల్లాటి ఏడుకొండలు, ఎంపీ రామారావు, పాదర్తి ప్రకాష్, రామకృష్ణ, పార్టీలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.